## క్లుప్తంగా

### వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వెంకటేశ్వర స్వామికి సుప్రభాతసేవ, అభిషేకం, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా స్వామివారికి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### నేత్రదానం


నేత్రదానం చేసిన సరోజనమ్మ(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరులోని మన సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నేత్రదానం జరిగింది. సంస్థ నిర్వాహకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం గ్రామానికి చెందిన పొన్నలూరు సరోజనమ్మ(72) అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కోరిక మేరకు కుటుంబసభ్యులు సరోజనమ్మ నేత్రాలను దానం చేశారని తెలిపారు. ఆమె నేత్రాలను నెల్లూరుకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్లు లాలేష్, బాలాజీ సేకరించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు గంగపట్నం విద్యార్థులు

ఇందుకూరుపేట: రాష్ట్ర స్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్‌కు మండలంలోని గంగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.చలపతి తెలిపారు. జిల్లా స్థాయిలో సీఎం కప్ అథ్లెటిక్స్ ఎంపికలు శనివారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. 400 మీటర్లు, 800 మీటర్లు పోటీల్లో ఎస్‌కే సమీర ప్రథమ స్థానం, 200 మీటర్లు, 100 మీటర్లు పి.ఇందు రెండో స్థానం, డిస్కస్ త్రో, జావలెన్ త్రో ప్రథమ స్థానంలో ఎస్‌కే అఫ్రీన్, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్లలో ద్వితీయ స్థానంలో షేక్ చషియా భాను విజయం సాధించారు. వీరంతా ఫిబ్రవరి 11, 12,13 తేదీల్లో తిరుపతిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ గోపి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులతో పాటు, గ్రామస్తులు అభినందించారు.

### కానిస్టేబుల్ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కోవూరు: కానిస్టేబుల్ రాత పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల రిజర్వ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20,952 మంది ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రాథమిక రాత పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులు 9 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరం పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు పనినిమిత్తం గూడూరుకు వెళ్లారు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా చెముడుగుంట వద్ద బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరికి గాయాలు కాగా, స్థానికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రామతీర్థం పీహెచ్‌సీకి మళ్లీ మొదటి ర్యాంకు


రామతీర్థం పీహెచ్‌సీ

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని రామతీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వరుసగా రెండోసారి జిల్లా మొదటి ర్యాంకు వచ్చినట్లు వైద్యుడు అమరనాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. డిసెంబర్ నెలలో తమ ఆస్పత్రిలో ఓపీడీ 2,443, ఐపీడీ 274, ల్యాబ్‌టెస్ట్‌లు 1,089, 7 కాన్పులు చేశామని తెలిపారు. ఈ క్రమంలో తమ పీహెచ్‌సీకి జిల్లాలోనే మొదటి ర్యాంకు వచ్చిందని తెలిపారు. ఇలా నవంబర్, డిసెంబర్ నెలలకు వరుసగా రామతీర్థం పీహెచ్‌సీకి జిల్లా మొదటి ర్యాంకు రావడం సంతోషంగా ఉందన్నారు.

# సంక్షేమ పథకాలే ప్రజలకు రక్ష

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు రక్ష అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం 3వ వార్డులో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్ ఎన్ని కుట్రలు పన్నినా ఈ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగుతారని తెలిపారు. గత మూడున్నరేళ్లలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా రూ.1.85 లక్షల కోట్లతో పేదలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. నవరత్నాల్లో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహారావు, కౌన్సిలర్లు ప్రత్యూష, మల్లారెడ్డి, అనంతమ్మ, షకీల, శివకుమార్‌రెడ్డి, నాయకులు భరత్, డాక్టర్ అల్లాభక్షు పాల్గొన్నారు.

**విడవలూరు మండలంలో..**

పెదపాళెం పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపాళెం, శంభునిపాళెం గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు కోవూరు నియోజకవర్గంలోని 48 సచివాలయాల పరిధిలో 54,800 గడపలకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యామని తెలిపారు.

**దివ్యాంగుడికి బ్యాటరీ ట్రైసైకిల్ వితరణ**

వెంకటరెడ్డిపాళేనికి చెందిన అక్కంగారి తాతయ్యకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.35 వేల విలువ చేసే బ్యాటరీ ట్రైసైకిల్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా తాతయ్య ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, మేకల పోలయ్య, కొండూరు శ్రీనివాసులు, సురేష్, సర్పంచ్ మేకల ప్రసన్న, ఎంపీటీసీ సభ్యురాలు బుజ్జమ్మ, అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం**


పురంధర్‌పురంలో సిమెంట్ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచంద్రాపురం పరిధిలోని ఇందిరమ్మకాలనీ, పురంధర్‌పురంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పురంధర్‌పురంలో పర్యటించినప్పుడు స్థానికులు సిమెంట్ రోడ్లు కావాలని అడిగారని, తాను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అడిగిన వెంటనే ఆయన రూ.10 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించామని తెలిపారు. అలాగే దాదాపు రూ.7 లక్షల జెడ్పీ నిధులతో రామచంద్రాపురం పరిధిలోని ఇందిరమ్మకాలనీలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని అందించడంతోపాటు స్థానికంగా మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలిత, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు మోర్ల మురళి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి, లక్ష్మి, కౌన్సిలర్ శ్రీదేవి పాల్గొన్నారు.

## అదానీ వరల్డ్ స్కూల్‌లో ప్లే జోన్


ప్లే జోన్‌ను పరిశీలిస్తున్న రాజేష్ రంజన్

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నంపోర్టు ఆధ్వర్యంలో గోపాలపురంలో నిర్వహిస్తున్న అదానీ వరల్డ్ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు అనువైన ఆహ్లాదకరమైన ప్లే జోన్‌ను శనివారం ఏర్పాటు చేశారు. పోర్టు సీఎస్సార్ హెడ్ రాజేష్ రంజన్ ఈ ప్లే జోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల ఎదుగుదలకు, మానసిక, శారీరక స్థైర్యానికి క్రీడలు దోహదపడతాయని, అందుకోసం క్రీడా మైదానాలు ఉండాలని అన్నారు. అదానీ వరల్డ్ స్కూల్ చదువుతోపాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రితేష్‌మెహతా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు

- ఎస్‌ఈబీ సీఐ వెంకటేశ్వరరావు


సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ వెంకటేశ్వరరావు

పొదలకూరు: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, సారా రహిత గ్రామాలుగా బిరదవోలు, బ్రాహ్మణపల్లి గుర్తింపు పొందాలని బిరదవోలు దత్తత అధికారి, నెల్లూరు ఎస్‌ఈబీ సీఐ వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జేడీ శ్రీలక్ష్మీ ఆదేశాల మేరకు మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాల, బిరదవోలు సచివాలయంలో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. మహిళలు సారా కేంద్రాలపై నిఘా ఉంచి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సారా వల్ల కుటుంబాలు నాశనమవుతాయని, తయారు చేసే వారు జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. ఇతర పనులు చేసుకుని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. ఎస్‌ఈబీ అధికారులు సారా తయారు చేస్తున్న గ్రామాలను దత్తత తీసుకుని సారా రహిత గ్రామాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పొదుపు మహిళలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సారా రహిత గ్రామాల కోసం తమకు సహాయ సహకారాలు అందించాలని సీఐ కోరారు. సారా తయారు చేస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులకు సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 14500 లేదా 9440902520 సీఐ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఈ సదస్సులో పొదలకూరు ఎస్‌ఈబీ ఇన్‌చార్జి సీఐ ప్రభాకరరావు, బిరదవోలు సర్పంచ్ బడుగు వెంకటరమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి


వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి

వెంకటాచలం: రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని అనికేపల్లి, కంటేపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న వరి పొలాలను శనివారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. వరి పంటకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు. రసాయన ఎరువులు వాడకం వల్ల తెగుళ్లు అధికమై పెట్టుబడుల భారం పెరుగుతుందన్నారు. అగ్గితెగులు, మెడవిరుపు, వేరుకుళ్లు తెగుళ్ల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

## దోమల నివారణకు చర్యలు


ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలో సర్పంచ్ కాకి ధనమ్మ ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఆటోలో ఫాగింగ్ యంత్రం అమర్చి గ్రామంలోని అన్ని వీధుల్లో సిబ్బంది ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గ్రామమంతా ఫాగింగ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీలపై 26 నుంచి నిషేధం

నెల్లూరు సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీ, వినియోగాన్ని ఈ నెల 26 నుంచి నిషేధించనున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్, హెల్త్ విభాగాధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీ మెటీరియల్‌ను తయారు చేయడం.. దిగుమతి, బ్యానర్ల ముద్రణ, వినియోగం, తదితరాలపై నిషేధం ఉంటుందని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక్ డ్రైవ్‌ను నిర్వహించి, చట్టాన్ని అతిక్రమించిన వారిపై పర్యావరణ రక్షణ చట్టం 1996 మేరకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

### నేడు ముత్తుకూరులో 'గడప గడపకు..'

ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీలో ఆదివారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్

పొదలకూరు: మండలంలో వంట గ్యాస్ లేని పేదలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో ఉజ్వల భారత్ పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్నట్టు ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉచిత గ్యాస్ కలెన్షన్ కింద గ్యాస్ సిలిండర్, స్టౌ, రెగ్యులేటర్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని తాటిపర్తి, పొదలకూరు, నావూరు, మహ్మదాపురం, నేదురుమల్లి, బత్తులపల్లి గ్రామ సచివాలయాల్లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శనివారం తోడేరు, మరుపూరు, ప్రభగిరిపట్నం సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు తోడేరు సచివాలయంలో, డేగపూడి, దుగ్గుంట, ఇనుకుర్తి సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు డేగపూడి సచివాలయంలో కొత్త గ్యాస్ కనెక్షన్ల కోసం నమోదు ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. వీరికి త్వరలో గ్యాస్ సిలిండర్, స్టౌ అందజేస్తామని తెలిపారు.

### 27న సామాజిక తనిఖీ ప్రజావేదిక

పొదలకూరు: మండల స్థాయిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజావేదికలో సామాజిక తనిఖీ చేసిన బృందాలు నివేదికను చదివి వినిపించనున్నట్లు తెలిపారు. 01-04-2020 నుంచి 31-03-2022 వరకు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజావేదికకు సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

### ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోండి

కోవూరు: గర్భిణులు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్యమిత్ర డి.రాజేశ్వరి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్, బ్లడ్ టెస్టులు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. డెలివరీ అయిన తరువాత ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ.5 వేలు ఇస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని వారు వలంటీర్ లాగిన్‌లో ఆరోగ్యశ్రీ కార్డు కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

కోవూరు: స్థానిక బండారుమాన్యంకు చెందిన ఎస్‌కే అష్రాఫ్‌అలీ 12 మద్యం బాటిళ్లను తీసుకొని వెళుతుండగా రుక్మిణి కల్యాణ మండపం వద్ద అదుపులోకి తీసుకున్నామని, అతని కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ నరహరి శనివారం తెలిపారు. ఆయన వెంట ఎస్సై శ్రీధర్, శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

## గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారిణి సత్యవాణి

కొడవలూరు: రానున్న 15 రోజుల్లో రూఫ్, శ్లాబు స్థాయిల్లో ఉన్న గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి పి.సత్యవాణి తెలిపారు. కొడవలూరులోని శివాలయం వెనుకనున్న జగనన్న లేఅవుట్‌ను శనివారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాది నాటికి మండలంలో 279 గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాల్సి ఉందన్నారు. మండలంలో 101 గృహాలు రూఫ్, శ్లాబు స్థాయిల్లో ఉన్నందున వారు మాత్రం 15 రోజుల్లోనే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 178 గృహాలు పునాదుల స్థాయిలోనే ఉన్నందున వారంతా ఉగాది కల్లా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నందున సకాలంలో పూర్తి చేయాలన్నారు. గిరిజనులకు సంబంధించి బేల్దారి కూలీలను కూడా లబ్ధిదారులు చెల్లించకుండా హౌసింగ్ అధికారులు బిల్లులో చెల్లించే వెసులుబాటు కల్పించినందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తొలుత స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులను ప్రోత్సహించి త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొనేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, డీఈఓ సునీత, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రాంతీయ రవాణా శాఖాధికారి మురళీమోహన్

- ప్రాంతీయ రవాణా శాఖాధికారి కె.మురళీమోహన్


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కొడవలూరు: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమని, అలా వాహనాలు నడపొద్దని ప్రాంతీయ రవాణా శాఖాధికారి కె.మురళీమోహన్ సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శనివారం రహదారుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా వచ్చిన ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పక డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ రాంబాబు, బి.గోపి, స్వప్నిల్‌రెడ్డి, కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, డైరెక్టర్ పి.కృష్ణచైతన్య, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కామాక్షితాయి సేవలో ప్రముఖులు


కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారిని జిల్లా ప్రాసిక్యూటర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీఎల్‌ఎస్‌ఎస్‌ఆర్‌వీ ప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.విజయ తదితరులు దర్శించుకున్నారు. తొలుత గణపతిస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు సత్కరించారు.

## ఘనంగా పురంధరదాసు ఆరాధన

నెల్లూరు(బృందావనం):కర్ణాటక సంగీత పితామహ పురంధరదాసు ఆరాధనోత్సవాలను శనివారం నిర్వహించారు. సంతపేటలోని వ్యాసరాజ మఠంలో పురంధరదాసు భజనమండలి అధ్యక్షురాలు నాగమణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. సంతపేటలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు నగర సంకీర్తనను నిర్వహించారు. కోలాట ప్రదర్శన, క్విజ్ పోటీలను జరిపారు. వ్యాసరాజ మఠం ప్రాంగణంలోని రమా సహిత సత్యనారాయణస్వామి మందిరంలో పంచామృతాభిషేకం, తదితరాలను జరిపారు. రమామణి, కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్టాన గౌరవాధ్యక్షుడు శ్రీధరాచార్య, నాగరాజారావు, మఠం మేనేజర్ రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



నెల్లూరు రూరల్: లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వాసిలికి చెందిన పది నెలల చిన్నారి వైద్యానికి పలువురు చేయూతనందించారు. డైకస్‌రోడ్డులోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో రూ.10 వేలను చిన్నారి తల్లికి శనివారం అందజేశారు. మాలకొండయ్య మనవడు సాయి శ్రీరామ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ మొత్తాన్ని వితరణ చేశారు. కౌశిక ప్రియాంక జన్మదినాన్ని పురస్కరించుకొని రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను తండ్రి రవితేజ అందజేశారు. రూ.1500తో పాటు బియ్యం బస్తాను ఆర్షియా, జాహిద్, గ్లోరీ ఇచ్చారు. ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, శ్రీధర్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఖాజామస్తాన్, రాజేష్, నారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## విలాసాలకు అలవాటుపడి.. దొంగలుగా మారి

నెల్లూరు(క్రైమ్): వారిద్దరూ యాక్టింగ్ డ్రైవర్లు.. సంపాదించిన మొత్తం వారి విలాసాలకు సరిపోకపోవడంతో గొలుసు దొంగలుగా మారారు. ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని గొలుసు దొంగతనాలకు పాల్పడుతూ చివరికి జైలుపాలయ్యారు. నగరంలోని తన కార్యాలయంలో నిందితుల వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విలేకరులకు శనివారం వెల్లడించారు. సరస్వతీనగర్‌లోని వినాయక ఆలయ సమీపానికి చెందిన రాజా సాయిచంద్ అలియాస్ చందు, వంశీకృష్ణ అలియాస్ వంశీ యాక్టింగ్ డ్రైవర్లు. చెడు వ్యసనాలు, విలాసాలకు వీరు బానిసలయ్యారు. సంపాదించిన మొత్తం వీరి వ్యసనాలు, విలాసాలకు సరిపోకపోవడంతో గొలుసు దొంగలుగా మారారు. కారు, బైక్‌లలో తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలించి.. వాటి ద్వారా వచ్చిన సొమ్ముతో జీవిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో నవాబుపేట పరిధిలోని పత్తివారిసూకల్ సమీపంలో ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును అపహరించారు. ఈ నెల 19న చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని రామ్‌జీనగర్ వద్ద ఉమశ్రీ మెడలోని బంగారు గొలుసును అపహరించేందుకు యత్నిస్తుండగా, బాధితురాలు ప్రతిఘటించారు. దీంతో ఆమె మెడలోని గొలుసు సగం దుండగుడు చేతికి చిక్కగా.. మిగిలిన సగభాగం ఆమె చేతిలో ఉండిపోయింది. చోరీ ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.25 లక్షల విలువ జేసే బంగారు గొలుసులు, కారు, టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్, ఎస్సై సుమన్, క్రైమ్ పార్టీ ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్, శివకుమార్, కానిస్టేబుళ్లు తిరుపతి, శివకుమార్, ప్రభాకర్‌ను డీఎస్పీ అభినందించారు.